క్లుప్తంగా

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం - 2022ను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని న్యాయవాదులు చేస్తున్న దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. స్థానిక శ్రీ కృష్ణదేవరాయల సర్కిల్‌లో కొనసాగుతున్న దీక్షల్లో ఆదివారం న్యాయవాదులు బాబుసాహెబ్, అబీబుల్లా, శ్రీనివాసులు కూర్చున్నారు. కార్యక్రమంలో కర్నూలు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగభూషణంనాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీనియర్ న్యాయవాదులు నిర్మలమ్మ, మురళీ, చంద్రుడు, తిరుపతయ్య, మహబూబ్‌బాషా, మోహన్‌రెడ్డి, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటోలు నిలుపుదల

కర్నూలు (టౌన్): క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించే వరకు క్లాప్ ఆటోలు నిలుపుదల చేస్తున్నట్లు సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, ఓల్డ్‌సీటీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పున్నమి అతిథి గృహం ప్రాంగణంలో క్లాప్ ఆటోలు నిలిపి వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ పెండింగ్ వేతనాలు చెల్లించకపోగా ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు రూ. 18,500 వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్, వీక్లీ ఆఫ్‌లు అమలు చేయడం లేదన్నారు. వీటిపై స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

పెన్షన్ రివిజన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్‌ఎన్‌ఎల్ సహాయ సర్కిల్ కార్యదర్శి రామదాసు

కర్నూలు (టౌన్) : కోర్టు తీర్పు ప్రకారం విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ రివిజన్ అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సహాయ సర్కిల్ కార్యదర్శి రామదాసు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సెంట్రల్ టెలీగ్రాఫ్ కార్యాలయ ప్రాంగణంలో ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా ద్వైవార్షిక, పెన్షనర్ డే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడదామన్నారు. అలాగే 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు వెంకటరమణ, సుధాకర్‌బాబు, ఎల్లయ్య, జాఫర్ వలీలను ఎన్నుకున్నారు.

1న వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1వ తేదీన వేతనాలు రాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేకపోవడంతో పెనాల్టీలు వేస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, కరువు భత్యం, జీవిత భీమా బకాయిలు, భవిష్య నిధి, ఆర్జిత సెలవు బకాయిలు చెల్లించాలన్నారు. విద్యా రంగంలో సంస్కరణల పేరుతో విద్యార్థులపై బలవంతపు చదువులను రుద్దడం సరికాదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతుల బదిలీలు పాత నిబంధనల మేరకే చేపట్టాలని, ఆదర్శ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు 010 హెడ్ జీతాలు, భవిష్య నిధి వర్తింపజేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె. జనార్ధన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్ల మూసివేత

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని చికెన్ సెంటర్లను మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు చికెన్ వ్యాపారస్తుల సంఘం నాయకులు నాగశేషులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ నిర్వహించిన చికెన్ వేస్టేజ్ టెండర్లను రద్దు చేయాలని తెలిపారు. చికెన్ వ్యాపారం చేసుకుంటున్న తమ నుంచి వేస్టేజ్ నగర పాలక సంస్థ సేకరిస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. చికెన్ వేస్టేజీని తామే అమ్ముకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఆయన అధికారులను కోరారు.



అభిమానం.. ఆటోలపై వైఎస్ జగన్ ఫ్లెక్సీలతో ర్యాలీ



పాతబస్తీలో వైఎస్‌ఆర్‌సీపీ జెండాలతో నాయకుల ప్రదర్శన



పాతబస్తీలో సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనం



సభాస్థలికి చేరుకుంటున్న ఎంపీ సంజీవ్‌కుమార్, మాజీ మంత్రి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



ఉత్సాహం.. సామాజిక సాధికార యాత్రలో మహిళ ఆనందోత్సాహం

పోటెత్తిన అభిమానం

సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం నగరంలో విజయవంతమైంది. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పాతబస్తీ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా జనాలు, జై జగన్ నినాదాలతో వీధులు హోరెత్తాయి. పార్టీ జెండాలు రెపరెపలాడాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలను వివరిస్తుండగా మైనార్టీలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. –సాక్షి, ఫొటోగ్రాఫర్



క్రేన్ సహాయంతో ప్రజాప్రతినిధులకు భారీ గజమాల వేస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న మాజీ మేయర్ బంగి అనంతయ్య వైఎస్‌ఆర్‌సీపీ జెండాల ప్రదర్శన



కొండారెడ్డి బురుజు వద్ద బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న జనం

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

కర్నూలు(హాస్పిటల్): విశ్వమానవాళికి అమృత తుల్యమైన ఆయుర్వేద శాస్త్రాన్ని అందించిన భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతిని ఆదివారం కర్నూలులో ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 8 గంటలకు నడకతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా మార్నింగ్ వాక్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బుధవారపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యవక్తలుగా, అతిథులుగా సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి.వాసురెడ్డి హాజరై ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక పాల్గొని ఆరోగ్య సూచనలు, సలహాలు అందించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై ఆరోగ్యభారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు వివరించారు. మన ఆరోగ్యం, గృహవైద్యం, జీవనశైలి వ్యాధులపై ఆరోగ్యభారతి జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకరరెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం రుతువుల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిడ్నీ, నేత్ర వ్యాధుల నివారణ ఆధారంగా సూచనలతో తయారు చేసిన ఆరోగ్యభారతి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి ఏపీ ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీ వీఎస్ రామశర్మ, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉప కార్యదర్శి స్వప్న పార్థసారథి, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముగిసిన సర్టిఫికేషన్ కార్యక్రమం

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫార్మాకో విజిలెన్స్ సర్టిఫికేషన్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, మెయిన్ స్ప్రింగ్ సీఈఓ కె.బసప్ప అతిథిలుగా హాజరై ప్రసంగించారు. ఫార్మాకో విజిలెన్స్ సర్టిఫికేషన్ కార్యక్రమం ద్వారా ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.జె. రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ డీన్ రాజ్ కుమార్, డా.షహేన్షా, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పది

కర్నూలు సిటీ: సనాతన ధర్మం ఎంతో గొప్పదని, దీని గురించి వేయి పడగలు నవలలో విశ్వనాథ సత్యనారాయణ చాలా చక్కగా వర్ణించారని డా.గంధ్ర లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక పింగళి సూరన తెలుగు తోటలో సాహితీ సదస్సు నిర్వహించారు. సభాధ్యక్షులుగా శ్రీ కురాడి చంద్ర శేఖర కల్కూర వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు శ్రీవిశ్వనాథ సత్యనారాయణ వేయి పడగల నవల సనాతన ధర్మ అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం జేఎస్ఆర్‌కే శర్మ, భరద్వాజ్, మహబూబ్ బాష, విజయమ్మ మాట్లాడారు. ఈ సదస్సులో రచయితలు డా.దండబోయిన పార్వతి దేవి, కావెం సుబ్బలక్ష్మీ, ఎలమర్తి రమణయ్య, ఇనాయతుల్లా, డా.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల ప్రారంభం

కర్నూలు (టౌన్) : విద్యార్థి దశలోనే ప్రతి విద్యార్థి, విద్యార్థినీ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాలులో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. దీని వల్ల చురుగ్గా ఉండి చదువులోనూ రాణిస్తారన్నారు. క్రీడల్లో రాణిస్తే దేశ, విదేశాల్లో పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో తైక్వాండో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి, డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ అమృత సాయి, తైక్వాండో పోటీల నిర్వాహకులు వెంకటేష్ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న తైక్వాండో క్రీడాకారులు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్) : క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉషూ పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన ఉషూ క్రీడల్లో రాణిస్తే విద్యా ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉషూ కార్యదర్శి మాస్టర్ టి. శ్రీనివాసులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు

క్రీడల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్) : ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేఈ జగదీష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని, అందులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం స్కేటింగ్ క్రీడల్లో ప్రతిభ చాటి ఉద్యోగాల్లో స్థిరపడిన సాయి చరిత, మనీష్‌కుమార్, రితిక, రశిక, అబూబకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో స్కేటింగ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారిణికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు

అవీ-ఇవీ

టీబీ డ్యాంకు ఆగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ఇక హొళగుంద సెక్షన్‌లో ఎల్లెల్సీలో నీటి ప్రవాహం ఆశాజనకంగా ఉంది. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహల్లి, వరనాడు, శివమొగ్గ, చిక్ మంగళూర్ తదితర దక్షిణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో నీటి చేరిక నిలిచింది. ఈ ఏడాది డ్యాంకు వరద ముందుగానె మొదలైనా ఆ తర్వాత వర్షాభావం కారణంగా నీటి చేరిక తగ్గిపోవడంతో జలాశయంలో నీరు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం డ్యాంలో 1590 అడుగులతో 11 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఇక 1,916 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి కాలువలకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి 84.832 టీఎంసీల నీటి నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 2,495 క్యూసెక్కులుండేది. ఇక జిల్లాలో ప్రవహించే దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం

మంత్రాలయం: అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం నిమిత్తం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి రెడ్డి, ఉపాధ్యక్షు డు వెంకటరామయ్య, జాయింట్ సెక్రటరీ ప్రా జేష్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులను కలిసి అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ అధికార ఆహ్వాన పత్రికను అందించారు.

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి

సద్గురు రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక మంత్రి మునియప్ప ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

క్రైం కార్నర్

తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు (టౌన్) : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెలంగాణ మద్యం పట్టుబడింది. స్టాంటన్‌పురం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి అక్రమంగా 36 తెలంగాణ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సోదాలు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి



ఓర్వకల్లు: నన్నూరు సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి(45) కుమారుడు, కుమార్తె చదువు నిమిత్తం నన్నూరు సమీపంలోని రాగమయూరీ గ్రీన్ హిల్స్‌ల్ ఉంటున్నాడు. పొలాలను చూసుకునేందుకు తరచుగా గ్రామానికి వెళ్లివచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పొలం పనులను పరిశీలించిన తర్వాత రాగమయూరికి తన సొంత బైక్‌పై వస్తున్నాడు. మరో ఐదు నిమిషాలలో ఇంటికి చేరుకునే సమయంలో పూడిచెర్ల గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా బైక్ నడుపుతూ మహేశ్వరరెడ్డి బైక్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో మహేశ్వరరెడ్డి కింద పడి తలకు తీవ్ర రక్త గాయమైంది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్

కర్నూలు (టౌన్): ఇమ్మానుయేలు చర్చి ఆధ్వర్యంలో స్థానిక కోల్స్ కళాశాల సమావేశ హాలులో ఆదివారం రాత్రి క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ఇండియన్ ఎవాంజిలికల్ మిషన్ మిషనరీ అన్నెపోగు విక్టోరియా రాణి క్యాండిల్ లైటింగ్ సర్వీసులో పాల్గొని దైవ సందేశం అందించారు. యేసుక్రీస్తు లోకమునకు వెలుగునిచ్చి చీకటి పారద్రోలారన్నారు. చర్చి యువతీయువకులు క్రిస్మస్ గీతాలను ఆలపించి చిరు నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు రెవరెండ్ పాల్ అగస్టీన్, రత్నప్రభ, రవికుమార్, చర్చి పెద్దలు ప్రకాష్, ప్రసన్న, సుధాకర్, స్త్రీల సమాజం పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

క్రీస్తు జననం పవిత్రమైనదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబు రావు అన్నారు. నంద్యాల చెక్‌పోస్టులోని మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్రిస్మస్, క్యాండిల్ లైటింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జాషువా, డేనియల్, జెట్టి ప్రభుదాస్, జయంత్, బతుకన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాజరస్, క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు.



క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్‌లో దైవసందేశం అందిస్తున్న విక్టోరియా

చట్టానికి లోబడి ఎరువులు విక్రయించాలి

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయంలో ఇన్‌పుట్ డీలర్లు విధిగా వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తూచా పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రసాయన ఎరువుల నియంత్రణ చట్టం, నిత్యావసర వస్తువుల చట్టం గురించి ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించారు. ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడే రసాయన ఎరువులను విక్రయించాలని పేర్కొన్నారు. ఎరువుల అమ్మకాల్లో పాటించాల్సిన నియమావళిని అతిక్రమిస్తే తగిన చర్యలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌పుట్ డీలర్లు చట్టాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... ప్రభుత్వం అనుమతించిన ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. అనుమతి లేని ఎరువులను విక్రయించి అనవసరంగా ఇబ్బందుల్లో పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు

ఉద్యమ కెరటం చంద్ర రాజకుమారి

కర్నూలు(అర్బన్): ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన చంద్ర రాజకుమారి కమ్యూనిస్టు పోరాటంలో ఉద్యమ కెరటంలా నిలిచారని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ గిడ్డమ్మ, పి. శ్రావణి అన్నారు. ఆదివారం చంద్ర రాజకుమారి 5వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయం సీఆర్ భవన్‌లో చంద్ర రాజకుమారి చిత్రపటానికి మహిళా నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్ర రాజకుమారి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల వైపు ఆకర్షితులై ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న సమయంలోనే వైద్య విద్యను కూడా పూర్తి చేయకుండా మహిళా సమాఖ్య బాధ్యతలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన రాజకుమారి తుది శ్వాస విడిచే వరకు మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షురాలిగా సేవలు అందించారన్నారు. ఆమె ఆశయ సాధనకు ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నగర నాయకురాళ్లు అమీనాబీ, వెంకటేశ్వరమ్మ, కేశమ్మ, పార్వతీ, సాయి చందన, లీల, మునెమ్మ, రేవతి తదితరులు ఉన్నారు.



చంద్ర రాజకుమారి చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

యోగాతో మానసిక ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): నిరంతరం ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలోకి వస్తాయని యోగా నిపుణులు సుధాకర్ గురూజీ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా తరగతులు సోమవారం నుంచి 10 రోజుల పాటు సాయంత్రం వేళల్లో ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా అంటే కేవలం ఆసనాలు ఒక్కటే కాదని, ప్రాణాయామం, ధ్యానం కూడా యోగాలో భాగమేనన్నారు. దీనివల్ల ఆలోచనలు నియంత్రణలోకి వచ్చి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కారణంగా మనసు అదుపులో ఉండి ఆలోచనలు తగ్గుముఖం పట్టి దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.